

జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలో ధ్వంసమైన రోడ్డు



దారులు దారుణం

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ జోన్ల పరిధిలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఖైరతాబాద్ నుంచి జూబ్లీహిల్స్ వెళ్లే రహదారి, ఖైరతాబాద్ చింతల్ బస్తీ, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీతో పాటు బేగంపేటలోని పలు రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన ఖైరతాబాద్ నుంచి జూబ్లీహిల్స్ వెళ్లే ప్రధాన రహదారి



ఖైరతాబాద్ పరిధిలోని చింతల్ బస్తీలో ధ్వంసమైన రహదారి



బేగంపేటలో ధ్వంసమైన రహదారుల్లో ఒకటి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ఎమ్మెల్యే కాలనీ, తన్వీర్ ఆస్పత్రి, కృష్ణానగర్ ఏ-బ్లాక్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ కేబీఆర్ పార్క్, యూసుఫ్‌గూడ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ఎస్ఆర్ నగర్ కమ్యూనిటీహాల్, పీఆర్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ ఎర్రగడ్డ లక్ష్మీ కాంప్లెక్స్, ఎస్ఆర్ నగర్ ఎస్వీఎస్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



జలమండలి జీఎం హరిశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రేమ్‌నగర్ బస్తీ నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్ బస్తీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అధికారులను కోరారు. సోమవారం బస్తీలో జలమండలి జీఎం హరి శంకర్, బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్ పర్యటించి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యలపై సంఘం నాయకులు వారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి కె.భగవాన్ దాస్, కోశాధికారి జి.సుధీర్‌కుమార్, నాయకులు దయానంద్ యాదవ్, కేఆర్ నర్సింగరావు, జలమండలి సిబ్బంది రమేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్నిస్ టోర్నమెంట్

బంజారాహిల్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్(హోట) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేఐసీ)లో జరుగుతున్న 19వ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లింగమనేని లక్ష్మీ మెమోరియల్ కప్ పేరుతో నిర్వహించిన ఈ పోటీలు ఈ నెల 7న ప్రారంభం కాగా.. 30 ఏళ్ల వయసు నుంచి 70 ఏళ్ల వారు పాల్గొన్నారు. 70 ఏళ్ల వయసులో సింగిల్స్, డబుల్స్ విజేతగా నిలిచిన గజపతిని పలువురు అభినందించారు. విజేతలకు హోట ఆధ్వర్యంలో అవార్డులను అందించారు.

వైద్యుడి ఇంట్లో బంగారు ఆభరణాలు మాయం

బంజారాహిల్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి ఇంట్లో బంగారు ఆభరణాలు మాయమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రోడ్డు నెంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో నివసించే వైద్యుడు ఎల్.నరేంద్రనాథ్ వద్ద దిలీప్‌గుప్తా, దుర్గా దంపతులు పనిచేస్తున్నారు. వారు ప్రతి నెలా సోమాజిగూడలోని క్లినిక్‌ను శుభ్రపరిచేవారు. ఈ క్రమంలో గత నెలలో క్లినిక్‌లోని 18 బ్యాటరీలు కనిపించకుండా పోవడంతో పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా దంపతులు తామే తీసినట్టు ఒప్పుకున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంట్లో పరిశీలించగా బీరువాలో ఉన్న 25 గ్రాముల బంగారు గాజులు, 40 గ్రాముల మంగళసూత్రం, 190 గ్రాముల రెండు గొలుసులు, 180 గ్రాముల వడ్డాణం, మరికొన్ని వస్తువులు కనిపించలేదు. నరేంద్రనాథ్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.



సంస్థ నిర్వాహకులను అభినందిస్తున్న లక్ష్మీనారాయణ

శాటిలైట్‌తో గ్రామీణ విద్యార్థులకు విద్య

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఖైరతాబాద్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌నెట్‌తో సంబంధం లేకుండా శాటిలైట్ ద్వారా గ్రామీణ, రిమోట్ ఏరియాల్లో ఉండే విద్యార్థులకు పాఠాలు నేర్పించే టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని సీబీఐ మాజీ జేడీ, జై భారత్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం లక్డీకాపూల్‌లో గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఐ లెర్న్ ఇంజన్, మెటా లెర్న్ ఇన్‌స్పైర్ ప్రైవేట్ లిమిటెడ్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన శాటిలైట్ డిజిటల్ ఎడ్యుకేషన్ స్టూడియోను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికీ ఇంటర్‌నెట్ లేని గ్రామాలు చాలా ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల కోసం శాటిలైట్ టీవీ టెక్నాలజీ ద్వారా పాఠాలు నేర్పించేందుకు ఈ సంస్థలు ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, లెర్న్ ఇన్‌స్పైర్ చైర్మన్ కల్యాణ్ హట్టి, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ కులభూషణ్ శర్మ, ఆలిండియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డైరెక్టర్ షిజు అగస్టిన్, శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్, లింగబలిజల కోడ్ 115

- వీరశైవ లింగాయత్ ఫెడరేషన్



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ నాయకులు

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే చేయడానికి వస్తున్న ఎన్యూమరేటర్లకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌లో వీరశైవ లింగాయత్, లింగబలిజ కోడ్ 115గా ఉందని, తమ సామాజిక వర్గానికి చెందిన వారంతా అదే కోడ్ చెప్పాలని తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ సూచించింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎం.వీరమల్లేష్, అధ్యక్షుడు బి.హనుమంతు, ప్రధాన కార్యదర్శి మల్కాపురం శివకుమార్ మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం తమకు అన్ని రంగాల్లో సముచితమైన వాటా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, యువజన విభాగం అధ్యక్షుడు ఆలూరె ఈశ్వర్ ప్రసాద్, నాయకులు కోట గుండప్ప, పాసరం శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగాల్లో ముదిరాజ్‌లకు అన్యాయం

- గుర్రాల మల్లేశం



దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ముదిరాజ్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి, యూత్ విభాగం అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్, మహాసభ ఉపాధ్యక్షులు బి.సత్తయ్య, బి.యాదగిరి, సమన్వయకర్త బొక్క శ్రీనివాస్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. అభయ హస్తం, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం తమను బీసీ-డి నుంచి బీసీ-ఏ జాబితాలోకి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభ ఆవిర్భవించి పది సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది, ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.



దక్షిణాది జేఏసీ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు

1971 జనాభా ప్రకారమే సీట్లను పెంచాలి

- దక్షిణాది జేఏసీ ప్రతినిధులు

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు అన్ని విధాలా నష్టపోతున్నాయని వక్తలు అన్నారు. 1971 జనాభా లెక్కల ప్రకారమే ఎంపీ సీట్లను పెంచాలని, రాష్ట్రాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ లోగోను మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్, వివిధ పార్టీలు, జేఏసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. 2011 లెక్కల ప్రకారం ఎంపీ సీట్లను పెంచితే ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువగా పెరుగుతాయన్నారు. జనాభా నియంత్రణ జాతీయ లక్ష్యం అయితే దానిని సాధించిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు.

కొత్త డెబిట్ కార్డు పేరుతో రూ.లక్ష లూటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అధికారుల పేరుతో ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు కొత్త డెబిట్ కార్డు జారీ చేస్తామంటూ ఖాతా నుంచి రూ.లక్ష కాజేశారు. నగరానికి చెందిన వ్యక్తి (50)కి సైబర్ నేరగాడు ఫోన్ చేసి యూనియన్ బ్యాంకు అధికారిగా పరిచయం చేసుకున్నాడు. కొత్త డెబిట్ కార్డు మంజూరైందని చెప్పి ఆధార్ వివరాలు సేకరించాడు. తర్వాత వాట్సాప్ వీడియో కాల్ చేసి స్ర్కీన్ షేరింగ్ చేయాల్సిందిగా సూచించాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు స్ర్కీన్ షేర్ చేయగానే సైబర్ నేరగాడు మొబైల్‌పై నియంత్రణ సాధించి సెల్ స్విచ్ఛాఫ్ చేసే అవకాశం కూడా ఇవ్వకుండా ఖాతా నుంచి రూ.లక్ష బదిలీ చేసుకున్నాడు.



పేలుడు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పేలుడు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్

బంజారాహిల్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పైస్ కిచెన్ రెస్టారెంట్‌లో జరిగిన పేలుడు ప్రాంతాన్ని సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. పేలుడు కారణంగా రెస్టారెంట్ వెనుక భాగంలో కూలిన షెడ్డు, ప్రహరీగోడ, శిథిలాలను పరిశీలించి వివరాలను సేకరించారు. హైడ్రా రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాశ్, మహేందర్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దుర్గాభవానీనగర్ బాధితులు, నర్సింగరావు

బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించండి

బంజారాహిల్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో జరిగిన పేలుడు కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బాధితులు కోరారు. ఈ మేరకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి సోమవారం దుర్గాభవానీనగర్ బాధితులు, ఫిలింనగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు వినతిపత్రం అందజేశారు. నర్సింగరావు మాట్లాడుతూ.. తెలంగాణ స్పైస్ కిచెన్ రెస్టారెంట్‌లో ఈ నెల 10న జరిగిన పేలుడు కారణంగా దుర్గాభవానీనగర్‌లో ఆరు గుడిసెలు నేలమట్టం అయ్యాయని, వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు.



కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్న క్షత్రియా హోటల్ ఎండీ శివరామరాజు, మాస్టర్ చెఫ్ భక్తి అరోరా

సందడిగా కేక్ మిక్సింగ్

బేగంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్షత్రియా హోటల్‌లో సోమవారం రాత్రి కేక్ మిక్సింగ్ సందడిగా సాగింది. హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ శివరామరాజు, జాయింట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాయత్రిరాజు, హోటల్ మాస్టర్ చెఫ్ భక్తి అరోరా తదితరులు కేక్‌ను మిక్సింగ్ చేశారు. ఇలా కలిపిన మిశ్రమంలో కొద్దిరోజుల తర్వాత తగినంత పిండిని కలిపి ప్లమ్ కేకులను, పుడ్డింగ్‌లను తయారు చేసి క్రిస్మస్ నాటికి వినియోగదారులకు అందజేస్తామని మాస్టర్ చెఫ్ భక్తి అరోరా తెలిపారు.

16 నుంచి మండల పూజలు

బంజారాహిల్స్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వర భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 16 నుంచి మండల పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాస్‌శర్మ సోమవారం తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం స్వామివారికి పడిపూజ, మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం అల్పాహారం అందజేస్తామన్నారు.

ఉచిత భోజనం కోసం వెళ్తే రూ.25 వేలు కొట్టేశారు

బంజారాహిల్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత భోజనం కోసం క్యూ లైన్‌లో నిలబడితే రూ.25 వేలు చోరీకి గురయ్యాయి. మెదక్ ఘన్‌పూర్‌కు చెందిన ఎర్రంశెట్టి భానుచందర్ తన కుమారుడి చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చాడు. ఈ నెల 10న ఆస్పత్రి ఎదుట ఉచిత భోజనం కోసం క్యూలైన్‌లో నిల్చున్నాడు. కొద్ది సేపటి తరువాత జేబు చూసుకోగా డబ్బులు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట యోధుడు జితేందర్ రెడ్డి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



జితేందర్ రెడ్డి సినిమా చూసిన అనంతరం మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అమీర్‌పేట నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జితేందర్ రెడ్డి తండ్రి కరుడుగట్టిన జాతీయవాదని, వారి కుటుంబమంతా జాతీయ భావజాలంతో పనిచేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జితేందర్ రెడ్డి సినిమాను సోమవారం అమీర్‌పేటలోని ఏసియన్ సత్యం టాకీస్‌లో కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జితేందర్ రెడ్డికి ప్రాణహాని ఉందని తెలిసినా ఆయన బాటను ఎప్పుడూ అడ్డుకోలేదని ఆయన తండ్రి చెప్పేవారన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి పలు బాధ్యతలు చేపట్టారని, ధర్మం కోసం 72 బుల్లెట్ల దాడిలో మరణించిన గొప్ప పోరాట యోధుడు జితేందర్ రెడ్డి అన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

- జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి



ప్రజల సమస్యలను వింటున్న మేయర్ విజయలక్ష్మి, అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి నిర్వహిస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కాగా, జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 103 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, యాదగిరిరావు, వేణుగోపాల్‌రెడ్డి, గీతా రాధిక తదితరులు పాల్గొన్నారు.



సమితి వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- జస్టిస్ బి.చంద్రకుమార్

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ డిమాండ్ చేశారు. డిసెంబరు 1న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి 5వ వార్షికోత్సవం, రైతు సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గల్ఫ్ తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర శంకర్, సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోర్సు ఇంద్రసేన, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు మన్నారం నాగరాజు తదితరులతో కలిసి వార్షికోత్సవం, రైతు సదస్సు పోస్టర్, కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కౌలు రైతులకు రైతు బంధు, బీమా సౌకర్యం, సబ్సిడీలు ఇవ్వాలని, బ్యాంకు రుణసౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలు, దళితులు, భూమి లేని పేదలు సాగుచేస్తున్న ప్రభుత్వ, ఫారెస్టు భూములపై వారికి హక్కులు కల్పించాలన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు

ప్రభుత్వానికి మేధావుల మాట పట్టదా!

- అంబేడ్కర్ వర్సిటీ నిరసనలో జేఏసీ నేతలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అంతా ఓపెన్ యూనివర్సిటీలదేనని తెలంగాణ మేధావుల వర్గం చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంబేడ్కర్ వర్సిటీ జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, సెక్రటరీ జనరల్ డా.పి.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు సోమవారం జూబ్లీహిల్స్ వర్సిటీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మేధావులు సీఎం రేవంత్‌రెడ్డికి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూములను ఎవరికీ కేటాయించరాదని లేఖ రాసినా, ఉద్యోగులు 53 రోజులుగా విశ్వవిద్యాలయంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ భూ కేటాయింపు లేఖను ఉపసంహరించుకోకపోవడం దురదృష్టకరమని వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ప్రొ.జి.పుష్పా చక్రపాణి, ఎండీ హబీబుద్దీన్, డా.ప్రమీల కేతావత్, కాంతం ప్రేమ్‌కుమార్, రజనికాంత్, రాములు, షబ్బీర్, జహంగీర్, డా.అవినాష్, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ నాయకుడు నర్సింహులు సోమవారం కలిసి అభినందించారు.
-బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, కార్పొరేటర్ పి.విజయారెడ్డి సోమవారం నియామకపత్రాలను అందజేశారు.
- బేగంపేట, ఆంధ్రజ్యోతి


రైల్వేస్టేషన్‌లో యాచిస్తున్న చిన్నారిని చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

యాచిస్తున్న చిన్నారిని చేరదీశారు..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో యాచిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీశారు. నాంపల్లి రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన వివరాల ప్రకారం.. నాంపల్లి రైల్వే స్టేషన్‌కు సోమవారం చేరుకున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆరేళ్ల చిన్నారి ప్రయాణికుల నుంచి డబ్బులు యాచిస్తున్న చిన్నారిని ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ చేరదీసి చైల్డ్ లైన్ కేంద్రానికి అప్పగించారు. చిన్నారి నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

రాంగోపాల్ పేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను ప్రేమ పేరిట నమ్మించి, కిడ్నాప్ చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించిన ఘటన రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరసింగ రావు తెలిపిన వివరాల ప్రకారం.... పశ్చిమ బెంగాల్ కు చెందిన షేక్ మిరాజ్ (26) బతుకు తెరువు నిమిత్తం ఆరు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి స్థిరపడ్డాడు. సికింద్రాబాద్‌లో ఓ నగల వ్యాపారి వద్ద స్టోన్ ఫిట్టింగ్ పనులు చేస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. తన కుమార్తె (17)తో చనువుగా ఉండడాన్ని గమనించిన యజమాని మిరాజ్‌ను పనిలోనుంచి తీసివేశాడు. దీనితో మిరాజ్ వేరే చోట పనిలో కుదిరి గత నెల 30న ఆ అమ్మాయితో ఉడాయించాడంతో అమ్మాయి తండ్రి రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అమ్మాయి మైనర్ కావడంతో కిడ్నాప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అమ్మాయిని ప్రేమ పేరిట వలలో వేసుకున్నట్లు గుర్తించారు. కాగా ఆదివారం జనరల్ బజార్‌లో మిరాజ్‌ను అదుపులోకి తీసుకుని అమ్మాయి ఆచూకీ తెలుసుకొని అమ్మాయిని వైద్య పరీక్షలు చేయించి తల్లిదండ్రులకు అప్పగించారు. విచారణలో మిరాజ్ అమ్మాయిపై అత్యాచారం చేసినట్లు తెలుసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇంటింటికి సర్వే స్టిక్కర్లు

మారేడుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే చేయడానికి అంగన్వాడీ సిబ్బంది కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పికెట్, బూసరెడ్డి గూడ, బాస్కర రావు గార్డెన్స్ ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి గోడలపై ఇంటి యజమాని పేరు రాసి స్టిక్కర్లను అతికించారు. ఏ రోజున, ఎప్పుడు, ఏ సమయంలో. ఏ ప్రాంతాలలో కులగణన చేపట్టే సిబ్బంది వస్తారో ముందుగా ఉన్నత అధికారులు సమాచారం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.


గడ్డమీద బస్తీలో మట్టికుప్పను చూపిస్తున్న బస్తీవాసులు

మట్టికుప్పను తొలగించండి

అడ్డగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లోని గడ్డమీదిబస్తీలో పేరుకుపోయిన మట్టికుప్పను వెంటనే తొలగించాలని డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కేఎస్ సుధాకర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డమీదిబస్తీలో పదేళ్ల క్రితం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు పవర్ బోర్ వేయించారని, అది కొద్ది రోజులకే పాడైపోయిందని, ఈ క్రమంలో సోమవారం ఓ స్వచ్ఛంద సంస్థ పాడైపోయిన పవర్ బోరింగ్‌కు మరమ్మతులు చేశారు. ఇక్కడ కొన్నేళ్లుగా పేరుకపోయిన మట్టికుప్పను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని, ఈ మట్టి కుప్ప బస్తీ ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారిందన్నారు. కార్యక్రమంలో రమాదేవి, అశోక్ కుమార్ తో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.


సాయినగర్‌లో పగిలిపోయిన మ్యాన్‌హోల్

'కొత్త మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేయండి'

అడ్డగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ లోని సాయినగర్ ఏరియాలో ఇంటి నెంబరు 10-5-459/1 వద్ద గత కొన్ని నెలలుగా మ్యాన్‌హోల్ పగిలిపోయి ఉందని వెంటనే కొత్త మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ సికింద్రాబాద్ సీనియర్ నాయకుడు సిహెచ్ కన్నాబిరాం తెలిపారు. ఇక్కడ మ్యాన్‌హోల్‌ను తొలగించి కొత్త మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని రాత్రి సమయంలో ఈ ప్రాంత వాసులు ప్రమాదానికి గురవుతున్నారన్నారు. వెంటనే కొత్త మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

ఆలయాల భద్రత మీది.. రక్షణ మాది

- ప్రతి ఆలయానికీ పాయింట్ బుక్ ఏర్పాటు చేస్తాం
- చుట్టూ సీసీ కెమెరాలు, లైట్లు అమర్చుకోవాలి
- సికింద్రాబాద్‌లోని ఆలయాల నిర్వాహకులతో ఏసీపీ సుబ్బయ్య అత్యవసర సమావేశం


ఆలయ నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతున్న గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య


సమావేశంలో పాల్గొన్న ఆలయాల నిర్వాహకులు

అడ్డగుట్ట/రెజిమెంటల్‌బజారు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని నార్త్‌జోన్ పరిధిలోని ఆలయాల నిర్వాహకులతో గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆలయాల భద్రత అంశంపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. నార్త్ జోన్ పరిధిలోని గోపాలపురం, మారేడుపల్లి, తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రముఖ ఆలయాల భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై ఇక్కడ ప్రధానంగా చర్చించారు. రద్దీ ప్రాంతాల్లో ఉండే ఆలయాల ముందు పోకిరీలు, తాగుబోతులు, రాత్రి సమయంలో ఆలయాల వద్ద నిద్రపోతున్న గుర్తుతెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, ఆలయాల వద్ద భద్రత పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో అక్కడక్కడ ఆలయాలపై జరుగుతున్న దాడుల కారణంగా నిర్వాహకులు భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భద్రత విషయంలో ఏమి అవసరం ఉన్నా తాము మీ వెంటే ఉంటామని భరోసా ఇచ్చారు. ఆలయాల భద్రత మీది.. రక్షణ మాది అన్నారు. మీకోసం నిరంతరం పోలీసులు పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మారేడుపల్లి, గోపాలపురం, తుకారాంగేట్ పీఎస్ పరిధిలోని ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రొజెక్టర్‌లో ఆలయాల చిత్రాలను చూపించిన పోలీసులు

గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య మారేడుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తన పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆలయాల భద్రతపై ప్రొజెక్టర్ ద్వారా చిత్రాలను చూపించారు. మారేడుపల్లి పీఎస్ పరిధిలో శ్రీమాత రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద, సాయిబాబా ఆలయం ముందు, వెనుక, దేవి మైసమ్మ, నల్లపోచమ్మ ఆలయం (లక్ష్మీనగర్), శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వెనుక ముందు, బంగారు మైసమ్మ ఆలయం వద్ద, తాయమ్మ ఆలయం (గాంధీనగర్) వద్ద సీసీ కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఆలయానికి వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసుకోండి



గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కొన్ని ఆలయాలకు వాచ్‌మన్ లేకపోవడం వల్ల ఇబ్బందులుంటాయి. ప్రధాన రోడ్లపై ఉన్న ఆలయాలలో మినహా గల్లీలో ఉన్న ఆలయాలకు భద్రత కనిపించడం లేదు. మీ ఆలయాలకు మీరు భద్రత ఉంటే మీకు పూర్తి రక్షణ ఇస్తాం.

\- నరేష్, గోపాలపురం పోలీస్‌స్టేషన్ సీఐ

లైటింగ్ కోసం జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేయండి



నగరంలో ఆలయాలపై జరుగుతున్న దాడులు జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలి. మీ ఆలయాలకు లైట్లు సౌకర్యం లేకపోతే వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయండి. లేదంటే మాకు సమాచారం ఇస్తే అధికారులకు లేఖ రాస్తాం. ఆలయాల్లో బంగారు ఆభరణాలు ఉంటే భద్రపరుచుకోవాల్సిన అవసరం ఉంది.

\- సుబ్బయ్య, గోపాలపురం డివిజన్ ఏసీపీ

ఆలయాల వద్ద భద్రత పెంచండి : గెల్లు ఉదయ్

అడ్డగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల వద్ద రాత్రి సమయంలో భద్రత పెంచాలని కోరుతూ హనుమాన్ భక్త సేవా సమితి ప్రతినిధి గెల్లు ఉదయ్ యాదవ్ తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ యాదవ్‌కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం ఉదయం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కార్యక్రమాలు చేసిన ధర్మ రక్షకులపై ప్రభుత్వం అక్రమకేసులు బనాయిస్తుందన్నారు. ఆలయాలపై దాడులు చేసిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రాగులరాజు, నర్సింగ్, విజయ్‌కుమార్, శివాజీ, దీపక్ పాల్గొన్నారు.

ఆలయాల భద్రతపై సదస్సు

బోయిన్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు ఉన్న ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటూ నిత్యం వాటిని పర్యవేక్షించాలని అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు నిర్వాహకులతో సోమవారం సికింద్రాబాద్ డైమండ్ పాయింట్‌లోని గాయత్రి గార్డెన్‌లో బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ రామయ్యల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ఆలయాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.

పదిరోజులలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్


అమ్మవారి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ పనులను తెలుసుకుంటున్న శ్రీగణేష్

రెజిమెంటల్ బజార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాలపై దాడులకు పాల్పడిన వారికి కఠినమైన చర్యలు తీసుకునే విధంగా చట్టాలలో మార్పులు చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం మోండా డివిజన్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ పునఃనిర్మాణ పనులు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని పది రోజులలో పనులు పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామని తెలిపారు. ఇష్టానుసారంగా ఆవులను పెంచకుండా గోవుల రక్షణకు ప్రత్యేక గోశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ఆలయాలలో పోలీసు భద్రత కల్పించాలని అన్నారు. ఆలయాలు, మహిళలు,ఆవులపై దాడులకు పాల్పడిన వారిని ఉరితీసేలా చట్టాలలో మార్పులు చేసినప్పుడే దాడులను అరికట్టవచ్చని సూచించారు. ఈ తరహా దాడులకు పాల్పడిన వారు జైలు కెళ్లడం, తిరిగి వచ్చి మళ్లీ నేరాలు చేస్తున్నందున చట్టాలు కఠినంగా ఉండాలని అన్నారు. కులగణన సర్వే చేయడం వలన ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని దురాలోచనతో బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణన బడ్జెట్ రూపకల్పనలో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందికంటి రవి, కేకే శ్రీనివాస్, సంకె రవీందర్ పాల్గొన్నారు.

కులగణనతో లాభం లేదు : ఎమ్మెల్యే తలసాని


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నదని, ప్రభుత్వం అభాసుపాలవుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. బన్సీలాల్ పేట లో సోమవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ, సర్వేలో 75 అంశాలతో ప్రశ్నలు ఎందుకని, ఎన్యుమరేటర్లు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పొంతనలేని సమాచారం అడుగుతుండటం వల్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో ఒక్కరోజులోనే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని గుర్తు చేశారు. సర్వే పూర్తి కాకుండా బీసీల రిజర్వేషన్లను తేల్చకుండా సర్పంచ్ ఎన్నికలపై ఎలా ప్రకటన చేస్తారని ప్రశ్నించారు. బండమైసమ్మ నగర్‌లో డిక్లాస్‌లో రూ.71లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను తలసాని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, అధికారులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి దేవాలయం దారి తెరవాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విన్నపం

తిరుమలగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లో స్వయంభుగా వెలిసిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం దారిని తెరిపించాలని దేవాలయం కమిటీ సభ్యులు సోమవారం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి విన్నవించారు. రక్షణ శాఖ అధికారులు కరోన సమయంలో దారిని మూసివేశారని స్వామి వారిని దర్శించుకోవడానికి లాల్‌బజార్ ప్రాంత భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. దీంతో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కిషన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ప్రేమ్ కుమార్, పవన్ కుమార్, అమిత్, ఆశిష్, బబ్లు ఉన్నారు.


వనభోజనాల కార్యక్రమంలో మాట్లాడుతున్న మడిపడిగ శ్రీనివాస్ గుప్త

వనభోజనాలను విజయవంతం చేయండి

అడ్డగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు వనభోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మడిపడిగ శ్రీనివాస్ గుప్త అన్నారు. కార్తీక వనభోజనాల సందర్భంగా సోమవారం లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు చీరాలలోని శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయానికి బయల్దేరారు. ఆయన మాట్లాడుతూ, 200 కుటుంబాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకుంటామన్నారు.



ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి

\- బేగంపేట, (ఆంధ్రజ్యోతి)

న్యాయవాదుల క్యాంటీన్ భవనానికి భూమిపూజ


తెలంగాణ హైకోర్టు జడ్జి విజయ్‌సేన్ రెడ్డి, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకకు సన్మానం చేస్తున్న సికింద్రాబాద్ కోర్టు న్యాయవాదులు

అడ్డగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సివిల్ కోర్టు ప్రాంగణంలో సోమవారం న్యాయవాదుల క్యాంటీన్ భవనానికి తెలంగాణ హైకోర్టు జడ్జి బి. విజయ్‌సేన్ రెడ్డితో పాటు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి వై.రేణుక చేతుల మీదుగా భూమి పూజ చేశారు. క్యాంటీన్ భవనంలోని గదులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైవసంత్ కుమార్ మాట్లాడుతూ క్యాంటీన్ భవనం నిర్మాణం జాప్యం లేకుండా వెను వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కోర్టు 1వ అదనపు చీఫ్ జడ్జి ఏ. వీరయ్యతో పాటు తెలంగాణ బార్ కౌన్సిలింగ్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, న్యాయవాదుల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, ఉపాధ్యక్షుడు టివి రమణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలి

- ఆర్‌వీఎస్ రాఘవరావు


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాఘవరావు

బౌద్ధనగర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రైల్వే పింఛన్‌దారుల సమస్యలపై కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని రైల్వేపింఛన్‌దారుల జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాఘవరావు డిమాండ్ చేశారు. సోమవారం చిలకలగూడ రైల్వే సంఘ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన రైల్వే పింఛన్‌దారుల సంఘ అనుబంధ వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పద్దెనిమిది నెలల డీఏ, డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంయుక్త పార్లమెంటరీ కమిటీలు సిఫార్సు చేసిన పింఛన్ పెంపుదల, మెడికల్ అలవెన్స్ రూ.3 వేలు పెంచాలని కోరారు. రద్దుచేసిన సీనియర్ సిటిజన్ రైల్వే రాయితీలను పునరుద్దరించాలన్నారు. లేకుంటే శాంతియుత ఉద్యమాల ద్వారా హక్కులను సాధించుకుంటామన్నారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలనాలపై మండిపడ్డారు. వచ్చేనెల 4,5,6వ తేదీల్లో రైల్వేకార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయని, జాతీయ ప్రధానకార్యదర్శి మర్రి రాఘవయ్య, ఎస్ఎఫ్ఐఆర్, అనుబంధ జోనల్ సంఘాలకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. సంఘ్ కోశాధికారి టీకే సింగ్ రైల్వే వైద్య, ఆరోగ్య సదుపాయలు, తదితర సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ్ నాయకులు రాజేందర్, జైపాల్‌నారాయణ, విద్యాసాగర్, మోజస్, వేముల ముత్యాలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

రాంగోపాల్‌పేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆమె జీహెచ్‌ఎంసీ డీఈ మహేష్, ప్రకాష్ నగర్ వాటర్ వర్క్స్ మేనేజర్ రమేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ రోడ్డు నిర్మాణ పనులకు రూ.28 లక్షల నిధులను 2022లోనే కేటాయించారని, పనులు మాత్రం మొదలు కాలేదన్నారు. ఇప్పటికైనా పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, బీజేపీ నాయకులు మధన్, మనోజ్ ఉపాధ్యాయ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్, కాలనీ అధ్యక్షుడు కొత్త రమేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర


న్యూఅశోక్‌నగర్‌లో బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బోర్‌వెల్ పనులు ప్రారంభం

బౌద్ధనగర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): న్యూఅశోక్‌నగర్‌లో నీటి సమస్యలను పరిష్కరిస్తామని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. సోమవారం న్యూఅశోక్‌నగర్ కమాన్ వద్ద బోర్‌వెల్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే కొంతమేర నీటి సమస్యను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు శ్రీకాంత్, బస్తీవాసులు పర్వతాలు, ఓములు, డప్పుమల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో ఫినో పేమెంట్స్ బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ ఇనాయతుల్లా

ఫినో బ్యాంక్ సేవింగ్ అకౌంట్ 'గుల్లక్' ప్రారంభం

బేగంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులతో పొదుపు చేయించడమే లక్ష్యంగా సేవింగ్ అకౌంట్ 'గుల్లక్' ప్రారంభించినట్లు ఫినో పేమెంట్స్ బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ ఇనయతుల్లా తెలిపారు. సోమవారం బేగంపేటలోని పైగా కాలనీలోని బ్యాంకులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ఫినో బ్యాంక్ 30 వేల మర్చంట్ పాయింట్‌లలో ఎక్కడైనా గుల్లక్ ఖాతా తెరవవచ్చన్నారు. కేవలం రూ.వెయ్యి బ్యాలెన్స్‌తో సేవింగ్ అకౌంట్ తీసుకోవచ్చన్నారు. బ్యాంకింగ్ ప్రక్రియను సులువుగా, సరళంగా, సౌకర్యవంతంగా మార్చడం జరిగిందన్నారు. ఖాతాదారుల ప్రత్యేక అవసరాలను తీర్చడంలో భాగంగా అనేక ప్రయోజనాలు అందించేందుకు ఈ అకౌంట్ ప్రారంభించామన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

బోయిన్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హిందువులకు పవిత్రమైన కార్తీకమాసంలో వచ్చిన సోమవారాన్ని కంటోన్మెంట్ బోర్డు 1వ వార్డు పరిధిలో గల కంసారిబజార్ బాళాశంకర్ ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుండి స్వామి దర్శనానికి బారులు తీరారు. కార్యక్రమానికి హాజరైన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, కాంగ్రెస్ నాయకుడు, కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి మధుకర్ ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నాగ శిలలకు పాలుపోసి కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచారు. అదేవిధంగా బోయిన్‌పల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పలు ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.


కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్న క్షత్రియా ఎండీ శివరామరాజు, మాస్టర్ చెఫ్ భక్తి ఆరోరా

కేక్ మిక్సింగ్

బేగంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పండ్ల ముక్కలు.. బాదం.. కిస్ మిస్... చెర్రీస్‌ను కలుపుతూ వాటిపై పలు రకాల లిక్కర్‌ను నెమ్మదిగా చిలకరిస్తూ కలుపుతూ కేక్ మిక్సింగ్ సందడిగా సాగింది. క్షత్రియా హోటల్‌లో సోమవారం రాత్రి జరిగిన కేక్ మిక్సింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్షత్రియా హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ శివరామరాజు, జాయింట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాయత్రిరాజు, హోటల్ మాస్టర్ చెఫ్ భక్తి ఆరోరా తదితరులు కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్నారు.

ఇలా కలిపిన ఆ మిశ్రమాన్ని కొన్ని రోజుల పాటు పెట్టిన అనంతరం వాటిలో తగినంత పిండిని కలిపి దాని నుంచి ప్లమ్ కేకులను, పుడ్డింగ్‌లను తయారు చేసి క్రిస్మస్ నాటికి అందజేస్తారని మాస్టర్ చెఫ్ భక్తి ఆరోరా వివరించారు.